క్లుప్తంగా

ఏఐవైఎఫ్ నగర సమన్వయకర్తగా మైనుద్దీన్



కడప వైఎస్ఆర్ సర్కిల్: అఖిల భారత యువజన సమాఖ్య నగర సమన్వయకర్తగా ఎస్కే మైనుద్దీన్‌ను ఎన్నుకున్నట్లు ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి గంగా సురేష్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన ఏఐవైఎఫ్ నగర సమావేశంలో ఆయన్ను ఎన్నుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఉపాధి కల్పించడంలో పూర్తిగా విఫలం చెందాయన్నారు. ఏఐవైఎఫ్ నాయకులు దేవ రాహుల్, శివ, నాగేంద్ర, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

రేపు వారసత్వ దినోత్సవ ర్యాలీ

కడప కల్చరల్ : ప్రపంచ వారసత్వ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం భారత జాతీయ కళా వారసత్వ పరిరక్షణ సంస్థ (ఇంటాక్) ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించనున్నట్లు సంస్థ జిల్లా చాప్టర్ కన్వీనర్ ఎస్.ఎలియాస్‌రెడ్డి తెలిపారు. ఉదయం 7.15 గంటలకు ఎర్రముక్కపల్లెలోని అమర వీరుల స్మారక స్థూపం వద్ద నుంచి ర్యాలీ ప్రారంభమై కలెక్టరేట్ ప్రాంగణంలోగల మహావీర్ మ్యూజియం వద్దకు చేరుతుందన్నారు. అలాగే రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ వారసత్వ సంపదగా భావిస్తున్న రాయలసీమలోని కొన్ని అరుదైన వారసత్వ కట్టడాల ఫొటోలను ఆవిష్కరించనున్నట్లు సంస్థ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు తెలిపారు.

జార్జిరెడ్డి స్ఫూర్తితో ఉద్యమిద్దాం

కడప ఎడ్యుకేషన్: విప్లవ విద్యార్థి నాయకుడు, ఫిజిక్స్ గోల్డ్‌మెడల్ పీడీఎస్‌యూ వ్యవస్థాపకుడు కామ్రేడ్ జార్జిరెడ్డి నేటి యువతకు ఆదర్శం అని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అంకన్న అన్నారు. ఆదివారం కడపలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో జార్జిరెడ్డి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంకన్న మాట్లాడుతూ నేడు నరేంద్రమోదీ ప్రభుత్వం విద్యా సంస్కరణల పేరుతో విశ్వ విద్యాలయాలలో అశాస్త్రీయ భావజాలాలను, మత ఛాంధస్సును ప్రోత్సహిస్తుండడం దారుణమన్నారు. నేటి యువత, విద్యార్థి సంఘ నాయకులు జార్జిరెడ్డి స్ఫూర్తితో యువత ఎదుర్కొంటున్న సమస్యలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. పీడీఎస్‌యూ అన్నమయ్య జిల్లా నాయకులు స్వరూప్‌తేజ్ నగర నాయకులు శ్రీనివాసులరెడ్డి, నరేంద్ర, సాయి, శివ, సునిత్, నరసింహా, రమణతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఇఫ్తార్

కడప కల్చరల్ : స్థానిక అల్మాస్‌పేటలోని కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ కార్యాలయంలో ఆదివారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ ముక్తార్ అహ్మద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత ప్రత్యేక ప్రార్థనలు చేసి ఇఫ్తార్ స్వీకరించి దీక్ష విరమించారు. అనంతరం మగ్రిబ్ ప్రార్థనలను సామూహికంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక న్యాయవాది సంపత్‌కుమార్, డాక్టర్ ఫరూఖ్, వివిధ పార్టీలకు చెందిన ప్రతినిధులు మగ్బూల్ బాషా, మునెయ్య, సుబ్బరాయుడు, బాబుభాయి, షామీర్ పాల్గొన్నారు.

పీజీ వైద్య విద్యార్థుల ఇఫ్తార్

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగర శివార్లలోని ఫాతిమా వైద్య కళాశాలకు చెందిన పీజీ వైద్య పరీక్షలు పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ ఏక్యూ జవ్వాద్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పవిత్ర మాసంలో పేదలను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సూచించారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సల్మాన్ ముర్తుజా, డైరెక్టర్ జయరామిరెడ్డి, డాక్టర్ ఓబులేశు, వైస్ ప్రిన్సిపాల్ రామమనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

చింతకొమ్మదిన్నె: కొత్తపేట–బుగ్గలేటిపల్లి సరిహద్దుల్లోని గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక పట్టు వస్త్రాలతో అమ్మవారిని అలంకరించారు. కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి ముద్దలను ఏర్పాటు చేసి ఆభరణాలను, పట్టు వస్త్రాలను కానుకలుగా సమర్పించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ పార్వతమ్మగారి విశ్వనాథ్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వాహణ అధికారి సురేష్ కుమార్‌రెడ్డి ఏర్పాట్లు చేశారు. పోతురాజు వద్ద ముద్దలను ఏరాటు చేసి జంతుబళులు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలోని పచ్చని చెట్ల మధ్య బంధుమిత్రులతో విందుభోజనాలను ఆరగించారు. సమీపంలోని ఆలయాలలో భక్తులు పూజలు నిర్వహించారు.

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

మైదుకూరు : మైదుకూరులోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ప్రవేశం కోసం అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ వై.విజయ ఒక ప్రకటనలో తెలిపారు. హైస్కూల్‌లో 6వ తరగతి 40 సీట్లు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం బైపీసీ 40 సీట్లు ఎస్సీ, ఎస్టీ, బీసీ, బీపీఎల్ వర్గానికి చెందిన వారు, తల్లిదండ్రులు లేని అనాథలు దరఖాస్తు చేసుకోవలని వివరించారు. ఏప్రిల్ 30 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

భాస్కర్ రెడ్డి అరెస్ట్‌పై నిరసన వెల్లువ



వైఎస్సార్ సర్కిల్‌లో నిరసన చేస్తున్న వైఎస్సార్‌సీపీ మహిళా కార్యకర్తలు

కడప కార్పొరేషన్: కడప పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి తండ్రి వైఎస్ భాస్కర్‌రెడ్డి అక్రమ అరెస్ట్‌కు నిరసనగా కడప ఏడురోడ్ల కూడలిలో నల్ల రిబ్బన్లతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. సీబీఐకి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి మాసీమ బాబు, ప్రభుత్వ సలహాదారు ప్రసాద్‌రెడ్డి, ఏపీ సోషల్ వెల్ఫేర్‌బోర్డు చైర్మెన్ పులి సునీల్ కుమార్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, ఏపీ నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ యానాదయ్య, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు పాకా సురేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు సీహెచ్ వినోద్ కుమార్, ఎస్ సుబ్బారెడ్డి, రామలక్ష్మణ్‌రెడ్డి, షఫీ, బంగారు నాగయ్య, కె. సూర్యనారాయణ రావు, మల్లికార్జున, లక్ష్మయ్య, మహిళా నేతలుటీపీ వెంకట సుబ్బమ్మ, క్రిష్ణవేణి, సునీత పాల్గొన్నారు.

వైఎస్సార్ విగ్రహం వద్ద మహిళా నేతల నిరసన

వైఎస్ భాస్కర్‌రెడ్డి అరెస్ట్‌ను నిరసిస్తూ స్థానిక హెడ్ పోస్టాఫీసు సమీపంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ మహిళానేతలు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీబీఐ పక్షపాత ధోరణిలో దర్యాప్తు చేస్తోందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మహిళా నేతలు రత్నకుమారి, టీపీ వెంకట సుబ్బమ్మ, పత్తిరాజేశ్వరి, సంధ్యారాణి, బండి మరియలు, జ్యోతి, నారాయణమ్మ, మూలే సరస్వతి, చైతల్య, తులశమ్మ,మల్లీశ్వరి, విజయకుమారి పాల్గొన్నారు.

కమలాపురం: మాజీ ఎంపీ వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తండ్రి భాస్కర్‌రెడ్డిని అరెస్ట్ చేయడం దారుణం అని, సీబీఐ విచారణ ఏకపక్షంగా సాగుతోందని రాష్ట్ర ఉద్యాన సలహాదారుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే ఆదేశాలమేరకు ఆదివారం ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి క్రాస్ రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు.

వృద్ధాశ్రమంలో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమం



31వ డివిజన్‌లో 'మా నమ్మకం నువ్వే జగన్' అంటున్న పింఛన్‌దారులు

కడప కార్పొరేషన్: కడప నగరం 31వ డివిజన్ పరిధిలోని కామిశెట్టి వృద్ధాశ్రమంలో కార్పొరేటర్ అజ్మతుల్లా ఖాన్ ఆధ్వర్యంలో ' జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు ఒకటోతేదీనే ఠంచన్‌గా ఇంటివద్దకే వెళ్లి పింఛన్ అందిస్తున్న వైనాన్ని వివరించారు. దీనిపై వృద్ధులంతా సంతోషంతో తమకు ఇంత మేలు చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తప్పకుండా అండగా నిలుస్తామని తెలిపారు.

బీఎస్ఎన్ఎల్ అభివృద్ధికి ఉద్యోగులు కృషి చేయాలి



మాట్లాడుతున్న బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సుధాకర్

కడప వైఎస్ఆర్ సర్కిల్: బీఎస్ఎన్ఎల్ అభివృద్ధికి ఉద్యోగులు కృషి చేయాలని బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సుధాకర్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని బీఎస్ఎన్ఎల్ ప్రధాన కార్యాలయంలో బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ మహాసభలు, ఆల్ ఇండియా బీఎస్ఎన్ఎల్ డాట్ పెన్షనర్స్ అసోసియేషన్ మహాసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ప్రతి ఒక్కరూ బీఎస్ఎన్ఎల్ పురోగతికి కృషి చేయాలన్నారు. అనంతరం బీఎస్ఎన్ఎల్ నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కళ్యా సుధాకర్, జిల్లా కార్యదర్శిగా ఆకుల సుబ్బారావు, కోశాధికారిగా జేఎల్ పంతులును ఎన్నున్నారు. అదే విధంగా ఆల్ ఇండియాబీఎస్ఎన్ఎల్ డాట్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా సి. సుబ్బారెడ్డి, జిల్లా కార్యదర్శిగా సుధాకర్, కోశాధికారిగాబీవి సుబ్బయ్యతో పలువురిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నామన్నారు. బీఎస్ఎన్ఎల్ ఏజీఎం శ్రీధర్ రెడ్డి, శ్రీనివాసరావు, యూనియన్ రాష్ట్ర కార్యదర్శి రమాదేవి, ప్రభాకర్ రావు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన వీరాంజనేయస్వామి తిరునాల

వల్లూరు : మూడు రోజులుగా జరుగుతున్న మండల పరిధిలోని పాపాఘ్ని నగర్ (కట్ట బస్టాపు) వద్ద వెలసిన శ్రీ పాపాఘ్ని వీరాంజనేయస్వామి తిరునాల మహోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. అర్చకులు స్వామి వారికి అభిషేకాలు, ఆకు పూజలను నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన చెక్క భజన కార్యక్రమం విశేషంగా ఆకట్టుకుంది.

బండలాగుడు పోటీలు

తిరునాల సందర్భంగా ఆదివారం నిర్వహించిన బండలాగుడు పోటీల్లో వీరపునాయునిపల్లె మండలం తలపనూరుకు చెందిన గంగిరెడ్డి ఎద్దు, కొండాపురం మండలం బేరుదూరుకు చెందిన శ్రీనివాసులు ఎద్దు కలిసి 4360 అడుగులు లాగి మొదటి స్థానంలో నిలిచాయి. కడప మండలం ఖాదర్‌ఖాన్ కొట్టాలుకు చెందిన భావనశ్రీ ఎద్దులు 4354 అడుగులు లాగి రెండవ స్థానంలో, అనంతపురం జిల్లా యల్లనూరు మండలం చిల్లమకూరుకు చెందిన పుట్లూరు సుదర్శన్ ఎద్దులు 4227 అడుగులు లాగి మూడవ స్థానంలో నిలిచాయి. ప్రొద్దుటూరు మండలం నాగాయపల్లెకు చెందిన విజయ్‌కుమార్‌రెడ్డి ఎద్దులు నాలుగవ స్థానంలో, ఖాదర్‌ఖాన్‌కొట్టాలకు చెందిన భావన శ్రీ ఎద్దు, చెన్నూరుకు చెందిన వేద వంశీరెడ్డి ఎద్దు ఐదవ స్థానంలో, అనంతపురం జిల్లా పెద్ద పప్పూరు మండలం చాగల్లుకు చెందిన వై.ఆది నారాయణ ఎద్దులు ఆరవ స్థానంలో, వల్లూరు చిన్న నాగిరెడ్డిపల్లెకు చెందిన తారకరెడ్డి ఎద్దులు ఏడవ స్థానంలో నిలిచాయి. మొదటి బహుమతిని రూ.30 వేలను ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి, ద్వితీయ బహుమతి రూ.20 వేలను మాజీ జడ్పీటీసీ అబ్బిరెడ్డి వీరారెడ్డి, మూడవ బహుమతి రూ.15 వేలను నారంగారి శంకర్‌రెడ్డి, నాలుగవ బహుమతి రూ.10 వేలను డీ వెంకటరావు, ఐదవ బహుమతి రూ.8 వేలను ఆది వేమయ్య , ఆరవ బహుమతి రూ.5,016లను గోసుల రమణారెడ్డి, ఏడవ బహుమతి రూ.3, 016 లను ఎల్.బాలగంగయ్య, బయన్న, సర్పంచ్, పాశం పెద్దక్క వితరణగా ఇచ్చారు.

దార్శనిక సంఘ సంస్కర్త 'వీరేశలింగం'



వీరేశలింగం జయంతిన సత్కారం అందుకున్న రంగస్థల కళాకారులు

కడప కల్చరల్ : పాతుకుపోయిన మూఢాచారాలకు పాతర వేసిన తెలుగు నాటక రంగాన్ని కొత్త ఒరవడిలో పయనింపజేసిన నవయుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం పంతులు అని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. యోగి వేమన విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలోని బ్రౌన్ కేంద్రంలో ఆదివారం కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి, తెలుగు నాటకరంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జునరెడ్డి, ఇతర సిబ్బంది రంగ స్థల కళాకారులతో కలిసి వీరేశలింగం చిత్రపటానికి పూలమాల అలంకరించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీరేశలింగం సేవలను కొనియాడారు. బ్రౌన్ కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి , రచయిత కొత్తపల్లి రామాంజనేయులు ప్రసంగించారు.

కళాకారులకు సత్కారం:

ఈ సందర్భంగా జిల్లాకు చెందిన ప్రముఖ రంగస్థల నటులు వీరదాసరి ప్రకాశ్, మచ్చా నరసింహాచార్యులు, మూల ఈశ్వర్‌రెడ్డి, గంగిరెడ్డిగారి రోశిరెడ్డి, యర్రమల్లు రామయ్యలను కార్యక్రమ నిర్వాహకులు ఆచార్య మల్లికార్జునరెడ్డి సత్కరించారు. బ్రౌన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వీరేశలింగం జయంతి

కడప ఎడ్యుకేషన్: కందుకూరు వీరేశలింగం పంతులు జయంతిని ఆదివారం కడపలోని జిల్లా పెన్షనర్ల సంఘం కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పెన్షనర్ల సంఘం జిల్లా సంఘం కార్యదర్శి రామ్మూర్తినాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగమునిరెడ్డి, సహాధ్యక్షులు రాధాకృష్ణ, కోశాధికారి నాగేశ్ వీరేశలింగం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నేటి యువత ఆయన మార్గాలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

ప్రచార భేరిలో సీపీఐ, సీపీఎం నాయకులు



పన్నుల ప్రభావం గురించి వివరిస్తున్న నేతలు

ప్రొద్దుటూరు : సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో 'మోదీని గద్దెను దింపండి – దేశాన్ని కాపాడండి' ప్రచార భేరి కార్యక్రమంలో భాగంగా ఆదివారం పట్టణంలో, మండలంలోని తాళ్లమాపురం, మూలవారిపల్లెలో సీపీఐ నాయకులు ప్రచారం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గ్యాస్, డీజిల్, పెట్రోలు ధరలు, రోడ్డు ట్యాక్స్ పెంచిందని వారు ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యుడు చంద్రశేఖర్, ఏరియా కార్యదర్శి సుబ్బరాయుడు, పట్టణ సహాయ కార్యదర్శి షరీఫ్, సమితి సభ్యుడు ప్రతాప్, సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ, ఏఐవైఎఫ్ నాయకులు విక్రమ్, సునీల్ పాల్గొన్నారు.

పర్మినెంట్ చేయాలి

కడప ఎడ్యుకేషన్: డీఎస్సీ–2008లో ఉపాధ్యాయులుగా నియమించిన వారిని పర్మినెంట్ ఉపాధ్యాయులుగా గుర్తిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వాలని ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఆదివారం కడప జిల్లా పరిషత్తులో 2008 డీఎస్సీ మినిమం టైం స్కేల్ ఉపాధ్యాయుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రామాంజనేయులు మాట్లాడుతూ 2008 డీఎస్సీనందు రాష్ట్ర వ్యాప్తంగా 2193 మందిని మినిమం టైం స్కేల్ ఉపాధ్యాయులుగా నియమించబడ్డారన్నారు. వీరికి గత సంవత్సరం 10 నెలల జీతం మాత్రమే ఇచ్చారన్నారు. వారికి ఇచ్చిన నియామక పత్రంలో పది నెలల జీతం మాత్రమే అని ఎక్కడ సూచించలేదన్నారు. వారికి ప్రభుత్వం 12 నెలల జీతం ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి వెంకటసుబ్బయ్య, నాయకులు ఆవుల రామచంద్ర, జిల్లా నాయకులు మదన్‌మోహన్‌రెడ్డి, సాగర్, రవిశంకర్, 2008 ఎంటీఎస్ ఉపాధ్యాయులు రామక్రిష్ణారెడ్డి, నాగేందర్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన హేలాంబ తిరునాల

కమలాపురం : మండల పరిధిలోని పెద్దచెప్పలిలో వెలసిన ఎల్లమ్మ(హేలాంబ) తిరునాల ఘనంగా ప్రారంభమైంది. ఆదివారం ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ మాచునూరు ఇంద్రావతమ్మ ఆధ్వర్యంలో, ధర్మ కర్తల మండలి సభ్యుల పర్యవేక్షణలో భక్తుల సమక్షంలో ఎల్లమ్మను ప్రతిష్టించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు. పెద్దచెప్పలిలో ప్రముఖ రంగ స్థల నటుడు, నంది అవార్డు గ్రహీత ఎల్.సుబ్బరాయుడు తన బృందంతో కలసి చెప్పిన ఎల్లమ్మ కథ భక్తులను ఆకట్టుకుంది.

పొంచి ఉన్న ప్రమాదం



ప్రమాదకరంగా ఉన్న గుంత

కడప సిటీ : కడప నగర పరిధిలోని వై– జంక్షన్ ప్రాంతంలో నడిరోడ్డుపై ప్రమాదం పొంచి ఉంది. రోడ్డుపై గోతి ప్రమాదకరంగా ఉంది. ఏమరుపాటున గమనించకపోతే వాహనదారులు తీవ్ర ప్రమాదాలకి గురయ్యే పరిస్థితి ఉంది. నిత్యం ఈ రోడ్డు వాహన రాకపోకలతో రద్దీగా ఉంటుంది.అంతే కాకుండా అటు అప్సర థియేటర్ ప్రాంతానికి, ఇటు తిరుపతి బైపాస్ రోడ్డుకు వెళ్లే రహదారులు కలిసే ప్రాంతం కూడా కాబట్టి ప్రమాదాలకు నెలవుగా ఈ గోతి కనపడుతోంది. ఇక్కడ ప్రమాద సూచిక బోర్డు కూడా అధికారులు ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. ఇప్పటినా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వాహనదారులు కోరుతున్నారు.

అపార్టుమెంట్లలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కడప అర్బన్ : అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా కడప ఫైర్ స్టేషన్ అధికారి, జిల్లా అగ్నిమాపక సహాయ అధికారి బసివిరెడ్డి ఆధ్వర్యంలో అగ్నిమాపక విన్యాసాలు నిర్వహించారు. కడప నగరంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో సత్యసాయి అపార్టుమెంటులో నివసిస్తున్న వారికి ఎల్‌పీజీ గ్యాస్ వల్ల కలిగే ప్రమాదాలను, విద్యుత్ కారణంగా సంభవించే అగ్ని ప్రమాదాలు, వాటిని ఎలా అరికట్టాలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ వారిచేతే ప్రయోగాత్మకంగా నిర్వహించారు. ఎలాంటి అగ్ని ప్రమాదాలు సంభవించినా 101, 08562–242299, 99637 37191 నెంబర్లకు సమాచారం అందించాలని తెలియజేశారు.డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, కడప అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదాలు జరిగితే 101కు డయల్ చేయండి

కమలాపురం : వంటింట్లో మహిళలు జాగ్రత్తలు పాటించి అగ్ని ప్రమాదాలను నివారించాలని, ఎల్‌పీజీ గ్యాస్ ప్రమాదాలు సంభవించినపుడు తక్షణం 101కు డయల్ చేయాలని ఎస్ఎఫ్ఓ నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈనెల 14వ తేదీ నుంచి జరుగుతున్న అగ్ని ప్రమాద వారోత్సవాల్లో భాగంగా మూడో రోజు ఆదివారం పట్టణ పరిధిలోని ఎండీఓ కాలనీలో మహిళలకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వంటింట్లో లేదా ఎక్కడైనా అకస్మాత్తుగా మంటలు వ్యాపించగా తక్షణం 101కు డయల్ చేయాలన్నారు. తర్వాత ఇంటికి ఉన్న తలుపులు, వాకిళ్లు తెరిస్తే లీకైన గ్యాస్ బయటకు వెళ్తుందన్నారు. మహిళలు తమ వంట ముగియగానే రెగ్యులేటర్ ఆఫ్ చేయాలన్నారు. ఒక వేళ ఇండ్లకు తాళం వేసి ఇతర ఊర్లకు వెళ్లినపుడు రెగ్యులేటర్ ను పూర్తిగా సిలిండర్ నుంచి తీసి వేయాలన్నారు. అలాగే అగ్ని ప్రమాదాలు సంభవించినపుడు లైట్లు ఆన్ లేదా ఆఫ్ చేయరాదన్నారు. గ్యాస్ గాలి కంటే బరువుగా ఉంటుంది కనుక అది కిందికే వెళుతుందని, అందు కోసం సిలిండర్ ఉంచే ప్రాంతంలో కింది భాగంలో ఒక చిన్న కిటికి ఉంచాలని, లీకైన గ్యాస్ ఈ కిటికీ గుండా బయటకు పోతుందన్నారు. అనంతరం వంటింట్లో జరిగిన అగ్ని, ఎలక్ట్రిక్ ప్రమాదాలను ఎలా ఆర్పాలి, వాటిని ఎలా ఎదుర్కోవాలి అనే అంశాలను ప్రత్యక్షంగా చేసి చూపించారు.

పేదలకు రంజాన్ తోఫా పంపిణీ



పేదలకు రంజాన్ తోఫా అందజేస్తున్న లజ్‌నతుల్ ఉలేమా కమిటీ ప్రతినిధులు

కడప కల్చరల్ : పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం కడప నగరంలోని ముస్లిం నిరుపేదలకు లజ్‌నతుల్ ఉలేమా కమిటీ ప్రతినిధులు రంజాన్ తోఫా అందజేశారు. స్థానిక కాగితాలపెంటలోని కింగ్ ప్యాలెస్ ఫంక్షన్ హాలులో జరిగిన ఈ కార్యక్రమానికి మౌల్వి వసీవుల్లా, జన వికాస్ సేవా సమితి అధ్యక్షులు తాహీర్,అమీన్ హాస్పిటల్ చైర్మన్ షేక్ నయీమ్ అతిథులుగా హాజరై అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులను పేరుపేరున అభినందించారు. కార్యక్రమంలో మౌల్వి హఫీజ్ అస్గర్ అలీ, ప్రభుత్వ ఖ్వాజీలు ఇషాక్, జుబేర్, హఫీజ్ అబ్దుల్లా, లజ్‌నతుల్ కమిటీ కోశాధికారి మౌలాన నూరుల్లా, స్థానిక ప్రముఖులు అక్బర్, రెహ్మాన్, అక్రమ్ పాల్గొన్నారు.

చిన్నారులకు వస్త్రాల పంపిణీ

కడప కల్చరల్ : కడప నగరం ఆశారేఖ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం బాలుర గృహంలో బాలలకు నూతన వస్త్రాలను అందజేశారు. సంస్థ చైర్మన్ నెమలిదిన్నె నాగవేణి, దాతలు వరలక్ష్మి, బంధుమిత్రుల సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఆశారేఖ ఫౌండేషన్ సభ్యులు, దాతల బంధుమిత్రులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత



ఆశ్రమానికి సరుకులు అందజేస్తున్న వరదారెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగర శివార్లలోని పద్మావతి వృద్ధాశ్రమానికి రూ.8 వేల విలువగల నిత్యావసర సరుకులను అందజేసినట్లు మున్సిపల్ హైస్కూలు రిటైర్డ్ హెడ్మాస్టర్ నంద్యాల వరదారెడ్డి తెలిపారు. ఉట్టి చిన్నసుబ్బరాయుడు అల్లుళ్లు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మనం అందించే సహాయ సహకారాలతో వృద్ధుల అవసరాలు తీరుతాయన్నారు. దాతలు ఇలాంటి సేవా కార్యక్రమాల నిర్వహణకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు రజని సుధాకర్, రాజు శ్రీమతి, వృద్ధాశ్రమ కార్యనిర్వాహకులు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యకు సాయం



కుటుంబానికి నగదును అందచేస్తున్న ఎంపీపీ వీర నారాయణరెడ్డి తదితరులు

కడప ఎడ్యుకేషన్: అన్నదానం ఆకలిని తీర్చితే విద్యాదానం కుటుంబానికి, సమాజానికి వెలుగు నిస్తుందని జిల్లా సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి, బి. మఠం ఎంపీపీ వీర నారాయణరెడ్డి, స్వచ్ఛంద సేవకుడు జమాల్ అన్నారు. కడప నగరం నబికోటలో టైలరింగ్ పనిచేసుకుని జీవనం సాగించే శ్రీనివాసులరెడ్డి అనే వ్యక్తి క్యాన్సర్ వ్యాధి బారినపడి గత సంవత్సరం ఏప్రిల్‌లో మృతి చెందాడు. దీంతో చార్టెడ్ అకౌంట్ చదువుతున్న ఆయన కుమారులిద్దరికి చదువుకు ఆర్థికంగా ఇబ్బంది ఏర్పడింది. విషయం తెలుసుకున్న బిమఠం మండల అధ్యక్షుడు చిలేకాంపల్లె వీర నారాయణరెడ్డి, జిల్లా సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి, బద్వేల్ పట్టణ స్వచ్ఛంద సేవకుడు జమాల్ ముందుకొచ్చి ఆదివారం ఆకుటుంబానికి రూ. 30 వేల రుపాయల ఆర్థిక సహాయాన్ని అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో బద్వేల్ పట్టణానికి చెందిన శ్రీధర్ కుమార్‌రెడ్డి, ప్రవీణ్, సంగీతం టీచర్ సుగునాకర్ తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో చిన్నారుల డ్యాన్స్ అదుర్స్



శిల్పారామంలో చిన్నారుల నృత్య ప్రదర్శనలు

కడప కల్చరల్ : కడప శిల్పారామంలో ఆదివారం ఆట విడుపు కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక వేదికపై కళాకారులు చిన్నారులు తమ ఆటపాటలతో సందడి చేశారు. స్థానిక శంకరాపురంలోని జీఆర్‌టీ జీవీకే ఇంగ్లీషు మీడియం పాఠశాల విద్యార్థులు పలు జానపద, శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించి అదుర్స్ అనిపించారు. ప్రముఖ సినీ గీతాలకు ప్రదర్శించిన నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. శిల్పారామం పాలనాధికారి శివప్రసాద్‌రెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

వైభవంగా అంకాలమ్మ జాతర

సింహాద్రిపురం : మండలంలోని అంకాలమ్మగూడూరులో వెలసిన అంకాలమ్మ దేవత జాతర ఆదివారం వైభవంగా నిర్వహించారు. జాతర సందర్భంగా ఆలయ చైర్మన్ అశోక్‌రెడ్డి భక్తులకు అన్ని అసౌకర్యాలు ఏర్పాటు చేశారు. అర్చకులు అనిల్‌కుమార్ శర్మ తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి సిరిబండిని ఆలయం చుట్టూ తిప్పారు. అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అనంతరం బండలాగుడు పోటీలను వైఎస్సార్‌సీపీ నేత వైఎస్ మధురెడ్డి ప్రారంభించారు. ఈ పోటీలలో 20 జతల ఎద్దులు పాల్గొన్నాయి. మొదటి బహుమతి కింద రూ.90 వేలను ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, రెండవ బహుమతి కింద రూ.80వేలు మండల ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, మూడవ బహుమతి కింద రూ.70వేలు ఆలయ చైర్మన్ అశోక్ రెడ్డి, నాల్గవ బహుమతి కింద రూ.60వేలు వైఎస్సార్‌సీపీ నాయకులు హరినాథరెడ్డి, మిగిలిన బహుమతులను దాతలు ఏర్పాటు చేశారు. పోటీలలో పాల్గొన్న ఎద్దులకు కన్సలేషన్ బహుమతులను ప్రదానం చేయనున్నారు. కార్యక్రమాల్లో ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి, రుషికేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలికల చదువు సమాజ పురోగతికి పునాది

వేంపల్లె : సమాజ పురోగతికి పునాది బాలికల చదువు అని జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక ఏపీ రెసిడెన్షియల్ బాలికల ఉర్దూ పాఠశాలను ఆయన సందర్శించి అక్కడ ఉన్న విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతోపాటు సంస్కారం, జ్ఞానంతోపాటు లోకజ్ఞానం పొందాలన్నారు. ముఖ్యంగా బాలికలు ఉన్నత లక్ష్యం, తపనతో ఉన్నత శిఖరాలు చేరాలంటే సున్నితమైన మనస్థత్వాన్ని వీడనాడి సమాజంలో ఎదుర్కొనే పేదరికాన్ని, అవమానాలను పాజిటివ్‌గా, చాలెంజ్‌గా తీసుకుని అనుకున్న లక్ష్యాన్ని సాధించాలన్నారు. ప్రతి విద్యార్థి సమాజం గురించి, సమాజంలో జరిగే సంఘటనల గురించి, పేదరికం గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి విద్యార్థి నిరంతర శ్రమ, సాధనలున ప్రధాన ఆయుధాలుగా మలుచుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, సీఆర్పీ ప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.